క్లుప్తంగా

అన్నసమారాధన

కొత్తపల్లి: స్థానిక బాలాత్రిపురసుందరీ సమేత రాజశేఖరస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దాత జ్యోతుల కాశిబాబు ఆర్థిక సాయంతో ఈ అన్నదానం నిర్వహించినట్టు ఆలయ అర్చకుడు శర్మ తెలిపారు. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప, ఉప్పాడ తదితర గ్రామాలకు చెందిన సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



బీసీ హాస్టల్ పూర్వ విద్యార్థులు

పిఠాపురం: ఒకరి కంచంలో గుడ్డు మరొకరు లాక్కుతినడం, ఒకరి దుప్పటి మరొకరు దాచేయడం వంటి చిలిపి పనులు, పాత జ్ఞాపకాలును నెమర వేసుకున్నారు అలనాటి స్నేహితులు. పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ హైస్కూల్లో చదువుకుంటూ ఒకే హాస్టల్ ఉన్న పలువురు స్నేహితులు సోమవారం పిఠాపురంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పిఠాపురం బీసీ హాస్టల్‌లోని 2002–2003 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 30 మంది విద్యార్థులు 21 ఏళ్ల తరువాత కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకుని నవ్వుకున్నారు. ఇకపై ఏటా కలుసుకోవడంతో పాటు ఎవరికి ఏ ఆపద వచ్చినా కలిసికట్టుగా ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు.

వరాహాలకు గడ్డు కాలం




పిఠాపురంలో పందుల కళేబరాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పిఠాపురం: వైరస్ బారిన పడి పందులు భారీగా చనిపోతున్నాయి. పిఠాపురం పట్టణంలో ఏ వీధిలో చూసినా పందుల కళేబరాలు దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ సిబ్బంది వాటిని తొలగించడానికి తీవ్రంగా శ్రమ పడాల్సి వస్తోంది. పిఠాపురం శివారు జగ్గయ్య చెరువు కాలనీలో సుమారు 50 పందుల వరకూ చనిపోయి దుర్వాసన వెదజల్లుతోందని అర్బన్ బ్యాంకు చైర్మన్ బాలిపల్లి రాంబాబు, స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సోమవారం పందుల మృత కళేబరాలను తొలగించారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా పందులు చనిపోయి కనిపిస్తుండడంతో వాటిని తొలగించడానికి ప్రత్యేక వాహనంతో పాటు సిబ్బందిని నియమించినట్లు పిఠాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ తెలిపారు.

22 నుంచి ఉపాధి హామీ అధికారులకు శిక్షణ

సామర్లకోట: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధి హామీ అధికారులకు విస్తరణ శిక్షణ కేంద్రాల్లో శిక్షణలు ఈ నెల 22 నుంచి ప్రారంభం అవుతాయని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న సామర్లకోట, శ్రీకాళహస్తి, బాపట్ల ఈటీసీల్లో మహాత్మాగాంధీ ఎన్‌ఆర్‌జీఎస్‌లో పనిచేస్తున్న ఏపీడీ, ఏపీఓ, ఈసీ, జేఈలకు శిక్షణలు ఉంటాయని తెలిపారు. దీనిలో భాగంగా సామర్లకోట ఈటీసీలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పని చేస్తున్న వారికి నాలుగు బ్యాచ్‌ల్లో ఈనెల 22 నుంచి మార్చి 15 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ప్రతీ బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు.

పట్టణంలో ఫ్లెక్సీల తొలగింపు



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నుంచి రాజకీయ నాయకుల ఫ్లెక్సీల తొలగింపు ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 16 నుంచి ఎన్నికల కోడ్ ప్రారంభం అయిన విషయం విదితమే. అన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమం ప్రారంభించగా సామర్లకోటలో ఆలస్యంగా రాజకీయ నాయకుల ఫ్లెక్సీల తొలగింపు ప్రారంభించారు. సచివాలయ కార్యదర్శుల పర్యవేక్షణలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు.

అడ్డుకట్టలతో దిగువ ఆయకట్టుకు

నీటి కొరత



వీకే రాయపురంలో బీటలు వారిన వరి పొలాలు

- గోదావరి కాలువలో తగ్గిన నీటిమట్టం
- ఆందోళన చెందుతున్న రైతులు

సామర్లకోట: వంతులవారీ విధానాన్ని అమలు చేస్తూ మొత్తం ఆయకట్టుకు నీరందించాలని అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నా ఎగువ ప్రాంతాల రైతులు కొందరు అడ్డుకట్టలు వేయడం వల్ల దిగువ ప్రాంతాల్లోని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలో 22,300 ఎకరాలలో దాళ్వా వరి సాగు చేస్తున్నారు. అయితే అనేక గ్రామాల్లో సాగు నీరు సక్రమంగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గోదావరి కాలువ చెంతనే ఉన్న రైతులు వంతుల వారీగా సాగునీరు తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. గోదావరి కాలువలో నీటిమట్టం తగ్గిపోవడం వల్ల పంట కాలువలోకి నీరు అందడం లేదు. కొంతమంది రైతులు గోదావరి కాలువలో మోటార్లు ఏర్పాటు చేసుకొని పంట పొలాలకు నీరు తీసుకుంటున్నారు. దిగువ ప్రాంతాల్లో సాగునీరు అందక రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. వీకే రాయపురం, మాధవపట్నం, ఉండూరు, అచ్చంపేట గ్రామాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. వీకే రాయపురం గ్రామంలో నీరు అందక ఇప్పటికే పొలాలు బీటలు తీశాయి. పరిస్థితిని ఇరిగేషన్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం కనిపించడం లేదని వీకే రాయపురం గ్రామానికి చెందిన రైతులు తలారి దొరబాబు, వెలమర్తి బుల్లిరాజు, శ్రీనివాసు, ఇంటి వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సార్వా సీజన్‌లో పంట పొలాలు ముంపునకు గురయి నష్టపోయామని, ప్రస్తుతం సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారు.



సామర్లకోట గోదావరి కాలువలో తగ్గిన నీటిమట్టం

ఎగువన ఉన్న కొందరు రైతులతో ఇబ్బంది

గోదావరి కాలువలో నీటిమట్టం తక్కువగా ఉండటం వల్ల రైతులకు వంతుల వారీగా సాగు నీరు అందిస్తాం. ఎగువ ప్రాంతాల్లో ఉన్న కొంతమంది రైతులు అడ్డుకట్టలు వేయడం వల్ల దిగువ ప్రాంతాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడుతోంది. సాగునీరు వాడకంలో సహరించాలని రైతుల సమావేశాల్లో తెలియజేస్తున్నాం.

– ఎ.రవికుమార్, ఇరిగేషన్ డీఈ, కాకినాడ

పరిస్థితిని కలెక్టర్ దృష్టిలో ఉంచాం

వీకే రాయపురంతోపాటు మరికొన్ని గ్రామాలకు సాగునీరు అందక పొలాలు బీటలు తీసిన పరిస్థితులను ఇరిగేషన్ అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. మండలంలో 80 శాతం వరకు రైతులు వెదజల్లు పద్ధతి లో వరి నాట్లు వేసుకున్నారు. సాగునీటి సమస్యను అధిగమిస్తాం.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

విద్యార్థులకు విస్తృతంగా 'రైజ్' శిక్షణ

రైజ్ కోర్సు కోఆర్డినేటర్ వీర ప్రసాద్

పిఠాపురం: అమెరికన్ లాంగ్వేజ్‌లో అదరగొట్టిన బెండపూడి విద్యార్థుల ప్రతిభతో బెండపూడి ఇంగ్లీష్‌గా పేరొందిన రెడీనెస్ ఇనీషియేటివ్ సిట్యుయేషనల్ ఇంగ్లిషు (ఆర్‌ఐఎస్‌ఈ) శిక్షణను విస్తృతం చేసినట్లు ఆర్‌ఐఎస్‌ఈ కోర్సు కోఆర్డినేటర్ గంటా వీర ప్రసాద్ తెలిపారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం రైజ్ ప్రోగ్రాంపై డెమో క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఎన్ఏ ఎంపీపీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైజ్ కోర్సు ద్వారా బెండపూడి ఇంగ్లిషును పిఠాపురం ఇంగ్లిషుగా మారుస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని బెండపూడి విద్యార్థుల మాదిరిగా రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిషులో మంచి ప్రావీణ్యం పొందాలనే దృఢ నిశ్చయంతో ఉందన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే రైజ్ ప్రోగ్రాంను పలు పాఠశాలల్లో ప్రారంభించామన్నారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో రైజ్ శిక్షణను ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో జనవరి 26న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని ఏప్రిల్ 4 వరకూ 35 రోజుల వ్యవధిలో పిల్లలకు అమెరికన్ లాంగ్వేజ్‌లో ఇంగ్లిషు నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ కందుకూరి పాల్ రాజు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులు, ఉపాధ్యాయులతో రైజ్ కోర్సు కోఆర్డినేటర్ వీర ప్రసాద్

నేడు రామకృష్ణ పరమహంస జయంతి

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం, పీబీ దేవం గ్రామాల్లో రామకృష్ణ పరమహంస జయంతిని మంగళవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వేట్లపాలెం రామకృష్ణ ధ్యాన మందిరంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 188వ జయంతి నిర్వహిస్తున్నట్లు సేవాసమితి నిర్వాహకుడు కంటిపూడి గోపాలకృష్ణ తెలిపారు. పీబీ దేవంలో శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు.

అన్నదానం

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. ఆలయం వద్ద నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాలు ముగియడంతో ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా దొరబాబు స్వామి వారికి పూజలు చేశారు.

కార్మికుడి మృతిపై విచారణ జరపాలి

పెద్దాపురం: స్థానిక వాలు తిమ్మాపురం రోడ్డులోని పట్టాభి ఆగ్రోఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మృతి చెందిన కార్మికుడు రాజు మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలని సీఐటీయూ పెద్దాపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ కార్మికుడు కనిపించకుండా పోయి దగ్గర నుంచి కంపెనీ యాజమాన్యం వింత వాదనలు చెబుతోందన్నారు. కార్మికుడికి కంపెనీ నుంచి పీఎఫ్, ఈఎస్ఐ కట్టలేదని దీంతో కుటుంబం మొత్తం దిక్కుదోచని స్థితిలో ఉందన్నారు. వర్క్‌మెన్ కాంపన్‌సేషన్ యాక్ట్ ప్రకారం ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

98 శాతం ఆధార్ అనుసంధానం పూర్తి

డ్వామా పీడీ వెంకటలక్ష్మి

కొత్తపల్లి: జిల్లాలోని ఉపాధి హామీ జాబ్ కార్డులకు 98 శాతం ఆధార్ అనుసంధానం పూర్తయినట్టు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ రికార్డులను సోమవారం ఆమె పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దీనిలో భాగంగా ప్రతి మండలంలో ఒక నర్సరీని ఏర్పాటు చేస్తారన్నారు. ప్రతిరోజూ జిల్లాలో 25 వేల నుంచి 30 వేల మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నట్లు చెప్పారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని రోజుకు సుమారు లక్ష మందికి ఉపాధి పని కల్పించడమే లక్ష్యమన్నారు. ఉపాధి పనుల వద్ద మెడికల్ కిట్లు, తాగునీరు, కూలీలు విశ్రాంతి తీసుకునేందుకు టెంట్‌లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట ఉపాధి ఏపీడీ వసంతమాధవి, ఏపీఓ రాజబాబు ఉన్నారు.



కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

ముఖ్యమంత్రి బీసీల పక్షపాతిగా మరోసారి నిరూపణ

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని అయ్యరక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరీ అన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడమే కాకుండా కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్లను నియమించారన్నారు. రాష్ట్రంలోని 18 ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి 11 స్థానాలు బీసీ అభ్యర్థులకు కేటాయించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఇది ప్రథమమని అన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: మాఘ అమావాస్యను పురస్కరించుకుని సోమవారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గంగాధరబట్ల గంగబాబు, యనమంద్ర శర్మ, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, వ్రతపురోహితులు చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. స్థానిక ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీ, 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

ఘనంగా అరుణ హోమం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సూర్య భగవానుడికి సోమవారం అరుణహోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తుల సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మాఘ మాసంలో ప్రత్యేక పూజలు చేయించుకున్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

ప్రభుత్వ పాఠశాలల్లో డీవైఈఓ తనిఖీలు



దానవాయిపేట హైస్కూల్లో రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈఓ సుభద్ర

తొండంగి: మండలంలోని అద్దరిపేట, దానవాయిపేట, తొండంగి హైస్కూళ్లను సోమవారం డీవైఈఓ సుభద్ర తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్, వర్క్‌బుక్‌లు, నోట్ బుక్‌ల కరెక్షన్లు పూర్తికావాలన్నారు. ఇప్పటికే ఇవన్నీ పూర్తయితే గూగల్ ఫాం ద్వారా తెలిపారన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సిలబస్‌లకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఆమె వెంట ఎంఈవో షేక్‌బాబ్జీ, విద్యాశాఖ సిబ్బంది ఉన్నారు.

25న కాకినాడలో ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్

ప్రత్తిపాడు: కాకినాడ రామారావుపేట లూథరన్ చర్చి సమావేశ హాలు ఆవరణలో ఈనెల 25న అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ (ఏఏఎఫ్) ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఏఏఎఫ్ ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు, న్యాయవాది పిల్లి బలరాముడు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఒకే లక్ష్యం–ఒకే ఎజెండా నినాదంతో ఈ వర్క్ షాపు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సుమారు ఏడు వేల మంది ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులున్నారని, వీరికి జ్యుడీషియరీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నమెంట్ ప్లీడరు (జీపీ), ఏజీపీ, పీపీ, ఏపీపీ వంటి నామినేటెడ్ పదవులకు ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులను ఎంపిక చేయడం లేదన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు సంఘటితంగా రాబోయే ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఏఏఎఫ్ ఎంపిక చేసిన వారి గెలుపే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన వివరించారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో ఏఏఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ బత్తిన సింహాచలం, జాయింట్ కన్వీనర్ రాయి శ్రీనివాసరావు, కాకినాడ పార్లమెంట్ మహిళా కన్వీనర్ వై.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో త్రిశూల స్నానం



పంచారామ క్షేత్రం కోనేరులో భక్తుల త్రిశూల స్నానం

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయ పుష్కరిణిలో సోమవారం త్రిశూల స్నానం నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి సమేత కుమారస్వామి కల్యాణ ఉత్సవాలల్లో భాగంగా గురువారం దీక్షాధారణ చేసిన సన్నిధిరాజు అంజిబాబు దంపతులకు ఆలయ కోనేరులో ముందుగా ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు త్రిశూల స్నానం చేయించారు. తదుపరి ఈఓ డి.నాగమల్లేశ్వరరావు దంపతులకు, భక్తులకు పుష్కరిణిలో ఆలయ పండితులు త్రిశూలస్నానాలు చేయించారు. ఆలయ కోనేరులో త్రిశూల స్నానం చేయడానికి భక్తులు పోటీ పడ్డారు. అంతకుముందు ఆలయంలో హోమం జరిగింది. కార్యక్రమంలో భక్త సంఘ నాయకులు బిక్కిన పరమేశ్వరసాయి, తలుపుల అంజనీకుమార్, బీవీ రమణ, చల్లా సత్తిబాబు భక్తులకు సేవలందించారు. త్రిశూల స్నానం అనంతరం స్వామి వారి అమ్మవార్ల తీర్థపు సేవ జరిగింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన షాపుల వద్దకు స్వామివారిని, అమ్మవార్లను పల్లకిలో తీసుకొని వచ్చి వారికి దర్శనం కల్పించారు. షాపుల యజమానులు విక్రయాలు చేసుకొనే వస్తువులను స్వామివారికి, అమ్మవార్లకు బహుమానంగా ఇచ్చారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల పర్వదినాల్లో అమావాస్య సోమవారం స్వామి వారికి ప్రీతైన రోజు రావడంతో అధిక సంఖ్యలో ఆలయానికి భక్తులు తరలివచ్చారు. స్వామివారికి తెల్లవారుజామున అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పూజల అనంతరం స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు దేవస్థానం నుంచి అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ట్రస్టుబోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, నేతల వెంకటలక్ష్మి, కౌన్సిలర్ నేతల హరిబాబు, ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు.



పంచారామ క్షేత్రంలోని స్వామివారు

ప్రభుత్వ భూమిని కాపాడకపోతే ఉద్యమం



తహసీల్దార్ త్రినాథరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం: స్థానిక అగ్రహారంలో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాచేసి క్రయవిక్రయాలు జరుపుతున్నారని, దానిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేపడతామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం సీపీఎం నాయకులు కోనేటి రాజు, కరణం విశ్వనాథం, కె.మణి, కె.నాగేశ్వరరావు పిఠాపురం తహసీల్దార్ త్రినాథరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రహారంలో ప్రభుత్వ భూమిని కొందరు బహిరంగంగా విక్రయించారని, అయినప్పటికీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి ప్రభుత్వ భూమిని విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ స్కామ్‌లోని ప్రతి ఒక్కరిపైనా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

స్పందనకు 15 అర్జీలు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతీ వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. వారం వారం నిర్వహించే స్పందనలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి 15 అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ వారం నిర్వహించిన స్పందనకు పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మార్చాలని, రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని, భూమి రీ సర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని అర్జీలు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించామని ఆర్డీఓ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్ పాల్గొన్నారు.



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

వైభవంగా రాజశేఖరస్వామి రథోత్సవం



రథంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

కొత్తపల్లి: స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామివారి రథోత్సవం సోమవారం కన్నులపండువగా జరిగింది. ఆలయ పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిత్య హోమం, బలిహరణ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. అనంతరం శూలాల సంబరం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన, బాణసంచా కాల్పులు భక్తులను అలరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం శ్రీపుష్పయాగంతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆలయ అధికారులు తెలిపారు.

రేపటి నుంచి వైజ్ఞానిక ప్రదర్శన

కాకినాడ సిటీ: ఈ నెల 22, 23 తేదీల్లో ఏఎంజీ ఉన్నత పాఠశాలలో జరగనున్న కాకినాడ జిల్లా స్థాయి సైన్సు ఎగ్జిబిషన్ జయప్రదం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ కోరారు. సోమవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. ఈ సైన్సు ఫేర్‌లో 21 మండలాల నుంచి ఎంపికైన 105 ప్రాజెక్టులు ప్రదర్శిస్తామన్నారు. ఈ ప్రదర్శన నుంచి 10 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు డీఈవో అన్నపూర్ణ తెలిపారు. కాకినాడ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జేడీ రాజు, జిల్లా సైన్సు అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్, అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్, ఎస్ఎస్ఏఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న డీఈవో అన్నపూర్ణ తదితరులు

సాల్ట్ భూములు పరిశీలించిన ఆర్డీఓ రమణ

కరప: మండలం పెనుగుదురులో నిరుపయోగంగా ఉన్న సాల్ట్ భూములను సోమవారం కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ కృత్తికా శుక్లా ఆదేశాల మేరకు పెనుగుదురులో సాల్ట్ భూములు పరిశీలించామన్నారు. ఇక్కడ 42 ఎకరాలు నిరుపయోగంగా ఉన్నట్టు గుర్తించామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అవి ఏ మేర ఉపయోగపడతాయో పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ రమణ తెలిపారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ ఈ.రామకృష్ణ, ఆర్ఐ పేపకాయల మాచరావు, వీఆర్వో పి.ఆదినారాయణ పాల్గొన్నారు.



సాల్ట్ భూములు పరిశీలిస్తున్న అధికారులు